శ్రీవారి సేవలో సినీ ప్రముఖులు

ప్రజాశక్తి -తిరుమల

తిరుమలలో పలువురు సినీనటులు సందడి చేసారు. శనివారం నైవేద్య విరామ సమయంలో హాస్యనటుడు బ్రహ్మానందం, అతని కుమారుడు రోషన్ కార్తీక్, యాంకర్ సుమ, ప్రముఖ సింగర్ సునీత వేరువేరుగా ఆలయంలోకి వెళ్లి స్వామివారి మూలవిరాట్టును దర్శించుకొని, హుండీలో కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి స్వామివారి శేషవస్త్రం సమర్పించి, తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల వీరితో ఫోటోలు, సెల్ఫీలు తీసుకోవడానికి అభిమానులు ఉత్సాహం చూపారు.

సూళ్లూరుపేట జాతీయ రహదారిలో...

బటన్ నొక్కుతాం ఇంటికి పంపుతాం

- సిఎంను హెచ్చరించిన కార్మిక సంఘాలు
- జిల్లావ్యాప్తంగా భారీ రాస్తారోకోలు
- గంటలకొద్దీ నిలిచిపోయిన వాహనాలు
- వెంకటగిరి, పుత్తూరులో అరెస్టులు

వెంకటగిరి పోలీసుస్టేషన్‌లో నాయకులు

40వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

ప్రజాశక్తి - తిరుపతి టౌన్,యంత్రాంగం

మొండివైఖరికి సిఎం జగన్మోహన్‌రెడ్డి మూల్యం చెల్లించక తప్పదని, తమను రోడ్డున పడేసిన సిఎం త్వరలోనే ఇంటికి వెళ్లక తప్పదని అంగన్‌వాడీలు మండిపడ్డారు. విజయవాడలో నిరవధిక దీక్షలు జరుగుతున్న క్రమంలో మానవత్వం లేకుండా సమస్యలు పరిష్కరించకుండా మొండిగా ఉండటాన్ని నిరసిస్తూ తిరుపతి జిల్లావ్యాప్తంగా భారీ రాస్తారోకోలు నిర్వహించారు. ఈ క్రమంలో గంటలకొద్దీ కిలోమీటర్ల దూరం వాహనాలు నిలిచిపోయాయి. అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె శనివారానికి 40వ రోజుకు చేరుకుంది.

– **తిరుపతి** బస్టాండ్ పూర్ణకుంభం సర్కిల్ వద్ద భారీ రాస్తారోకో నిర్వహించారు. దాదాపు 45నిమిషాల పాటు కిలోమీటర్ల దూరం వాహనాలు నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతమంతా దిగ్బంధమయ్యింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చట్టబద్ధమైన సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి అన్ని రకాలా ప్రయత్నాలు చేస్తున్నారని, అధికారులను ఉసిగొల్పి ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరింపులకు పూనుకుంటున్నారని, కొత్తవారిని తీసుకుంటామని హెచ్చరికలు చేస్తున్నారని, అయినా అంగన్‌వాడీలు బెదిరింపులను ఖాతరు చేయకుండా సమ్మెను ఉధృతం చేయడాన్ని అభినందించారు. చట్టబద్ధమైన సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి సిడిపిఒలు, సూపర్‌వైజర్లు ప్రయత్నిస్తే న్యాయపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాక్రిష్ణ, ఐఎఫ్‌టియు కార్యదర్శి సుబ్రమణ్యం, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు నాగరాజమ్మ, అరుణ ప్రసంగించారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించి వేతనాలు పెంచాలని, గ్రాడ్యుటీ అమలు చేయాలని కోరారు. ఈ రాస్తారోకోలో సిఐటియు నేతలు టి. సుబ్రమణ్యం, వేణుగోపాల్, బుజ్జి, తంజావూరు మురళి, రవి, జయచంద్ర సాయిలక్ష్మి, హేమలత, అక్బర్, చిన్నా, ఎన్ డి శ్రీనివాసులు, ఎఐటియుసి నాయకులు ఎన్ డి రవి, శివ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో..

– **వెంకటగిరిలో** రాపూర్‌క్రాస్‌రోడ్డులో రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు దౌర్జన్యంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజును అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు, సిఐటియు నాయకులకు మధ్య తోపులాట చోటు చేసుకుంది. పోలీసు జులుం నశించాలి, అరెస్టు చేసిన వందవాసి నాగరాజును విడుదల చేయాలంటూ అంగన్‌వాడీలు పోలీసు స్టేషన్ ఎదుట నినాదాలు చేశారు. వి.నాగరాజు మాట్లాడుతూ అంగన్‌వాడీలు కడుపు కాలి ఉద్యమం చేస్తుంటే, వెంకటగిరిలో ఎస్‌ఐ నరసింహారావు దురుసుగా ప్రవర్తించడం దుర్మార్గమన్నారు. చేతులకు పని పెడతామని ఎస్‌ఐ హెచ్చరించడం ఏంటని ప్రశ్నించారు. అంగన్‌వాడీలను ఎస్మా చట్టం తెచ్చి బెదిరించాలని చూస్తే బెదిరేవాళ్లు ఇక్కడ ఎవరూ లేరన్నారు. ప్రభుత్వాల మెడలు వంచి విజయాలు సాధించినచరిత్ర అంగన్‌వాడీలకు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు చెంగయ్య, ప్రాజెక్టు యూనియన్ నాయకులు ఎ.మంజుల, ఎన్.స్వరూపరాణి, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

– **గూడూరు టౌన్‌లో** పాత బస్టాండ్ సెంటర్ వద్ద రాస్తారోకో చేపట్టారు. టిడిపి నాయకులు సంఘీభావం ప్రకటించారు. టిడిపి మహిళా రాష్ట్ర కార్యదర్శి లీలావతి మాట్లాడుతూ పాదయాత్రలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్‌చేశారు. టిడిపి నాయకులు మట్టం శ్రావణి, శ్రీదేవి, అంగన్‌వాడీ నాయకులు ఇంద్రావతి పాల్గొన్నారు. జనసేన పట్టణ అధ్యక్షులు ఇంద్రవర్ధన్‌కుమార్ సంఘీభావం ప్రకటించారు.

– **నాయుడుపేటలో** అంబేద్కర్ విగ్రహం సమీపంలో మానవహారం నిర్వహించారు. సిఐటియు జిల్లా నాయకులు శివకవి ముకుంద, అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యదర్శి శ్యామలమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలను రోడ్లపై నిలబెట్టి చెలగాటం ఆడుతోందన్నారు. రాబోవు రోజుల్లో వైసిపి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

– **పిచ్చాటూరులో** ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. చర్చల పేరుతో అంగన్‌వాడి యూనియన్ నాయకులను పిలిచి అవమానించిన సజ్జల రామకృష్ణారెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ట్రాఫిక్ జామ్ అవడంతో ఎఎస్‌ఐ వెంకటరాజు జోక్యం చేసుకుని రాస్తారోకో విరమింపజేశారు. సిఐటియు నాయకులు నాగలాపురం నాగరాజు, రామచంద్రారెడ్డి, మురగేష్, మునిశంకర్, కృష్ణవేణి, గ్లోరీ, ప్రమీల పాల్గొన్నారు.

– **చంద్రగిరిలో** టవర్‌క్లాక్ వద్ద రాస్తా రోకో నిర్వహించారు. సమస్యలు పరిష్కరించేంత వరకూ సమ్మె ఆపే ప్రసక్తి లేదని అంగన్‌వాడీలు హెచ్చరించారు. సిఐటియు నాయకురాలు లక్ష్మి, ఎఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.శ్రీరాములు మాట్లాడుతూ 40 రోజులుగా దాదాపు లక్ష ఆరువేల మంది మహిళలు రోడ్లపై నిరసనలు తెలుపుతుంటే కళ్లులేని కబోతులా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

– **శ్రీకాళహస్తి** ఎపీసీడ్స్ సర్కిల్ వద్ద సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా రాస్తారోకో, మానవహారం నిర్వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి వైయస్ మణి, ఐఎఫ్టియు జిల్లా నాయకులు హరికష్ణ సంయుక్తంగా మాట్లాడుతూ 40 రోజులుగా తమ న్యాయపరమైన కోర్కెల సాధన కోసం అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్టు లేదని మండిపడ్డారు. నాయకులు పెనగడం గురవయ్య, గంధం మణి రామిశెట్టి వెంకయ్య పాల్గొన్నారు.

– **రేణిగుంటలో** ఎంఆర్‌ఒ ఆఫీసు వద్ద సమ్మె 40వ రోజు కొనసాగింది. ఎన్టీఆర్ సర్కిల్ వద్ద రోడ్డు దిగ్బంధం చేసి రాస్తా రోకో నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి హరినాథ్, ఎఐటియుసి మండల కార్యదర్శి కార్తీక్ మాట్లాడుతూ అంగన్‌వాడీ అక్కచెల్లెమ్మలు చాలీచాలని జీతాలతో రోడ్డున పడి నలభై రోజులుగా సమ్మెచేస్తుంటే జగనన్న ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేకపోవడం దారుణమన్నారు. నాయకులు మురళి, మోహన్‌రెడ్డి, నరసింహారెడ్డి, రామిరెడ్డి, నాదముని, శివానందం, సత్యశ్రీ, యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ధనమ్మ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

పిచ్చాటూరులో

పుత్తూరులో..

– **నాయుడుపేటలో** అంగన్‌వాడీ జిల్లా నాయకురాలు మేకల హైమావతి ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.దీంతో రెండు కిలోమీటర్ల మేర వాహనాలు స్తంభించాయి. సిఐటియు మండల అధ్యక్షులు రమణయ్య, కార్యదర్శి కే. లక్ష్మయ్య, నాయకులు బి.పద్మనాభయ్య, కే.లక్ష్మయ్య, కే.సాంబశివయ్య, సుంకర అల్లేయ్య పాల్గొన్నారు.

– **కోట** క్రాస్‌రోడ్డు వద్ద కొద్దిసేపు బస్సుల రాకపోకలను నిలిపేశారు. పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళనను విరమింపజేశారు. జిల్లా అధ్యక్షురాలు పద్మలీలమ్మ, సిఐటియు నాయకులు మునిరాజా పాల్గొన్నారు.

– **పుత్తూరులో** బైపాస్ పున్నమి హోటల్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పోలీసులు బలవంతపు అరెస్టులకు పాల్పడ్డారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్‌ను, అంగన్‌వాడీలను అరెస్టు చేశారు. అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి పురుషోత్తం, యూనియన్ నాయకులు ముని కుమారి, విజయ కుమారి, ధనమ్మ పాల్గొన్నారు.

తిరుపతిలో...

డాక్టర్ల కలయిక అ'పూర్వం'

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

వారంతా శ్రీ వేంకటేశ్వర మెడికల్ కళాశాల 1968 బ్యాచ్ డాక్టర్లు.. ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడ చదువుకున్నారు. వైద్య నిపుణులుగా ఎక్కడెక్కడో స్థిరపడ్డారు.. 55 వసంతాలుగా చెక్కుచెదరని స్నేహం.. శనివారం తిరుపతిలోని ఓ ప్రైవేట్ హోటల్లో తిరిగి వారిని కలిపింది. వివిధ దేశాల్లో నివసిస్తూ 55 సంవత్సరాల తరువాత కలుసుకున్న 60 మంది మిత్రుల పలకరింపులు, పులకరింతల మధ్య ఈ కలయిక కోలాహలంగా జరిగింది. తాము చదువుకున్న మెడికల్ కాలేజీని సందర్శించారు. అప్పటి గురువులను, ఆనాటి తిరుపతి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సమావేశం ఎంతో మధురమైనదని పలువురు అభిప్రాయపడ్డారు. డాక్టర్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ 1968-74 మధ్య ఎస్వీఎంసిలో చదువుకున్నామని, మళ్లీ ఇలా కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. డాక్టర్ ఎం.భాస్కర్‌నాయుడు మాట్లాడుతూ స్నేహితులను కలుసుకోవడం ఎంతో బలమన్నారు. అలాగే డాక్టర్ జె.చలం రచించిన కథాబృందావనం, 55వ ఏడు జరుగుతున్న రీ యూనియన్ ఎమిరాల్డ్స్ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. డాక్టర్ రమేష్‌నాథ్, డాక్టర్ రామచంద్రనాయుడు తదితరులు తమ కళాశాల అనుభవాలను పంచుకున్నారు.

భువనిక..సాటిలేదిక..!

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం

చిన్నారి భువనికకు ఐదు సంవత్సరాలు. ఇంత చిన్న వయసులోనే భగవద్గీత శ్లోకాలు, రాముడి వంశవక్ష చరిత్రను, అన్నమయ్య సంకీర్తనలను అలవోకగా ఆలపిస్తూ అందరిని అబ్బురపరుస్తోంది తిరుపతి సత్యనారాయణ పురానికి చెందిన భువనిక అంజూరు. చిన్నారి తన టాలెంట్ తో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం సంపాదించిందని భువనక తల్లి కవిత మీడియాకు తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో తాను చదువుతున్న ఫ్యూచర్ అండ్ ప్లే స్కూల్ అకాడమిక్ హెడ్ స్వర్ణలత, తల్లి కవితలతో కలిసి భూమిక మీడియా ముందు తాను నేర్చుకున్న భగవద్గీత శ్లోకాలను, రాముడి వంశవక్ష చరిత్రను, అన్నమయ్య సంకీర్తనలను ఆలపించి తన టాలెంట్ ప్రదర్శించింది.

త్వరలో భవానీనగర్ రోడ్డు ప్రారంభం

తిరుపతి టౌన్ : తిరుపతి టీటీడీ పరిపాలనా భవనం పక్కన భవానీనగర్ వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత శనివారం పరిశీలించి పనులు వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేసారు. ఈ సందర్భంగా కమిషనర్ హరిత మాట్లాడుతూ తిరుపతి టీటీడీ పరిపాలనా భవనం ప్రహరి గోడను ఆనుకొని భవానీనగర్ గుండా రైల్వే కాలనీ వైపుగా 500 మీటర్ల పొడవుతో వెలుతున్న కాలువను నూతనంగా నిర్మించడం జరిగిందని, దానిపై స్లాబ్ వేసి రోడ్డును నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ రహదారి పూర్తి అయితే చుట్టు పక్కల చాలా ప్రాంతాలకు సౌకర్యవంతమైన రహదారిగా ఏర్పడుతుందన్నారు. మునిసిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి, డిఈ విజయకుమార్ రెడ్డి, కాంట్రాక్టర్ సహాన్ వున్నారు.

ఎస్వీయూలో ఎపి లాసెట్, పీజీ లాసెట్ స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి -క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో స్పాట్ అడ్మిషన్ల ద్వారా ఏ పి లా సెట్ అండ్ ఏ పి పిజి లా సెట్-2023(ఎల్ఎల్‌యం, యల్‌యల్‌బి (ఐదు సంవత్సరాలు)కోర్సు చేరదలచిన విద్యార్థులకు ఉన్నత విద్యామండలి మరో అవకాశం కల్పించినట్లు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ఆచార్య మురళీ ఒక ప్రకటనలో తెలిపారు. యస్వీయూలోని వివిధ లా విభాగాల్లో వున్న ఖాళీ సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేస్తామని చెప్పారు. ఖాళీలను వెబ్సైటులో చూడవచ్చని, 25/1/2024 తేదీన లా సెట్ , పి జి లా సెట్ -2023 సర్టిఫికేషన్ వెరిఫికేషన్ , స్పాట్ అడ్మిషన్స్ జరుగుతాయని డివోఏ డైరెక్టర్ పేర్కొన్నారు. పైన తెలిపిన తేదీలో ఇప్పటి వరకు సీట్లు పొందని విద్యార్థులు డిఓఏ కార్యాలయంలో తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో రిపోర్టు చేయవచ్చని తెలియజేశారు. లా సెట్ -2023 సెట్లో ర్యాంకు పొందిన విద్యార్థులు మాత్రమే స్పాట్ అడ్మిషన్లకు అర్హులని, గతంలో రెండు ఫేజ్ లలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్లకు అనర్హులని, అలాగే స్పాట్ అడ్మిషన్ల ద్వారా చేరిన వారికి ఫీజు రియంబర్స్ మెంట్ సౌకర్యం వర్తించదని ,ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు ఈ అడ్మిషన్ల ప్రక్రియ కార్యక్రమాన్ని జరుపుతున్నట్లు వారు ఈ సందర్భంగా తెలిపారు. మరిన్ని వివరాలను ఖాళీలను వెబ్ సైట్ ద్వారా పొందవచ్చన్నారు.

ఎంపీ ఎన్నికను రద్దు చేయాలి: రజనీకాంత్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

2021లో తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో భారీగా దొంగ ఓట్లు నమోదు జరిగిందని, దొంగ ఓట్లను గుర్తించిన కేంద్ర ఎన్నికల సంఘం అధికారులపై చర్యలకు ఉపక్రమించిన తరుణంలో ఎంపీగా ఎన్నికైన గురుమూర్తి ఎన్నికను రద్దు చేయాలని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కంకణాల రజనీకాంత్ నాయుడు డిమాండ్ చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ హాయంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్ గా, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ గా విధులు నిర్వహించిన ఐఏఎస్ అధికారి గిరీషా ఉత్తమ అధికారిగా పేరు తెచ్చుకున్నారని అలాంటి అధికారిని నేడు అధికార దాహంతో ఒత్తిళ్లకు గురిచేసి దొంగ ఓట్లు నమోదు చేయించి నేడు సమాజంలో దోషిగా నిలబెట్టారని, ఎవరైతే అధికారులను ఒత్తిళ్లకు గురిచేసి దొంగ ఓట్లు నమోదు చేయించారు వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. 2024లో జనసేన తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో విచారణ కమిటీ వేయించి దొంగ ఓట్లకు బాధ్యులైన వారిని సమాజం ముందు నిలుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి తిరుపతి పార్లమెంటు ఉపాధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, దినేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

3-5 తేదీల్లో ధార్మిక సదస్సు

తిరుమల: తిరుమలలో ఫిబ్రవరి 3 -5 తేదీల్లో శ్రీ వేంకటేశ్వర ధార్మిక సదస్సునిర్వహించనున్నట్టు టిటిడి అధికారులు తెలిపారు. సదస్సుకు దేశవ్యాప్తంగా గల మఠాలు, పీఠాలకు చెందిన స్వామీజీలతోపాటు భావసారూప్యం గల సంస్థల ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు.

దొంగ ఓట్లపై జనసేన దండయాత్ర

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

తిరుపతిలో సుమారు నలభైవేల పైచిలుకు దొంగ ఓట్లు ఉన్నాయని జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ముందు శనివారం పెద్ద ఎత్తున ధర్నా చేపట్టి, ఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ హరిప్రసాద్, తిరుపతి ఇంచార్జ్ కిరణ్ రాయల్, నగర అధ్యక్షుడు రాజారెడ్డి మాట్లాడుతూ.. తిరుపతిలో పెద్ద ఎత్తున దొంగ ఓట్లు నమోదయ్యాయని, తక్షణమే వాటిని తొలగించి ఈ నెల 22న విడుదల చేయనున్న ఓటర్ల తుది జాబితాను వాయిదా వేయాలని, దొంగ ఓట్లకు తిరుపతి నిలయంగా మారిందని, కొందరు రాజకీయ నాయకుల మాటలు విని గతంలో దొంగ ఓట్ల నమోదుకు సహకరించిన అధికారులు కొందరిని సస్పెండ్ చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా అధికారులు ఏ ఒక్క రాజకీయ పార్టీకి కొమ్ము కాయకుండ దయచేసి నిస్వార్థంగా పనిచేయాలని, ఓటర్ జాబితాను పున్హ పరిశీలించాలని, ఎక్కడైనా ఒక్క దొంగ ఓటు ఉందని తెలిసినా జనసేన పెద్ద ఎత్తున నిరసనలకు, ధర్నాలకు దిగుతామని హెచ్చరించారు.

దొంగోట్లతో 'అధికార' దర్పం

ప్రజా'దృష్టి'

ప్రజాశక్తి-తిరుపతి సిటి



రాజకీయాలకు రౌడీయుజం తోడయ్యింది. దొడ్డిదారిన అధికారాన్ని హస్తగతం చేసుకునేందుకు కుట్ర రాజకీయాలకు తెరలేపుతున్నారు. గతంలో ఫ్యాక్షనిజం ప్రాంతాల్లో రిగ్గింగ్‌కు పాల్పడేవారు. తాము గెలవలేము అని అంచనా వస్తే బ్యాలెట్ బాక్స్‌లో నీళ్లు, ఇంకు పోసేవారు. ఇప్పుడు సాంకేతికపరిజ్ఞానం పెరగడంతో సిసి కెమెరాల నిఘా ఎక్కువ కావడంతో పంథా మార్చారు. పథకం ప్రకారం దొంగోట్లు నమోదు చేసేందుకు శ్రీకారం చుట్టారు. అధికారులపై ఒత్తిడి తెచ్చి, వారి ద్వారానే ఓట్లు నమోదు చేయిస్తూ అధికారాన్ని చేజిక్కించుకునేందుకు పెద్ద కుట్రకు తెరలేపారు. గతంలో జరిగిన అక్రమాలు నిజం అని తేలడంతో ఎట్టకేలకు ఓ ఐఎఎస్ అధికారిని బలి పశువును చేశారు. ఆలస్యంగానైనా ఈసి చర్యలు తీసుకోవడంతో అధికారుల్లో భయాందోళనలు మొదలయ్యాయి. త్వరలోనే ఓటర్ల తుది జాబితా ప్రకటించనున్న నేపథ్యంలో పై చర్యలు అధికారులకు ఓ రకంగా హెచ్చరికేనని చెప్పవచ్చు.

అది 2021 తిరుపతి పార్లమెంట్ సభ్యులు, అధికార వైఎస్‌ఆర్‌సిపి ఎంపి బల్లి దుర్గాప్రసాద్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఉప ఎన్నికలు అనివార్యం అయింది. ఆయన స్థానంలో కొత్త సభ్యుని ఎన్నుకునేందుకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇచ్చింది. తిరుపతి వైసిపి అభ్యర్థిగా మద్దిల గురుమూర్తిని అధికార పార్టీ ప్రకటించింది. కనీసం 5 లక్షల మెజార్టీతో గెలిపించాలని పార్టీ పెద్దలు పిలుపునిచ్చారు. ఇంకేముంది స్థానిక నాయకులు అత్యుత్సాహం చూపించారు. అధికార జులుంను ప్రదర్శించారు. అధికారులపై ఒత్తిడి తెచ్చారు. వేలాది దొంగ ఓట్లను సృష్టించారు. బయట వ్యక్తులను తీసుకొచ్చి ఎన్నికల రోజు ఓట్లు వేయించారు. ప్రతిపక్షాలు అధికార పార్టీ ఆగడాలను అరికట్టాలని నడుం కట్టి, ఎన్నికల రోజు పలు ప్రాంతాల్లో దొంగ ఓటర్లను స్వయంగా పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వారిపై ఎలాంటి చర్యలు లేవు, ఇతర ప్రాంతాల నుంచి ఓటర్లు తరలిస్తున్న బస్సులను పట్టుకుని పోలీసులకు అప్పగించినా కేసులు నమోదు చేసిన పాపాన పోలేదు. అంతా అధికార పార్టీ నాయకుల కన్నుసన్నల్లోనే ఎన్నికలు వారు అనుకున్న రీతిన ముగిశాయి. ఇక ఏముంది 2 లక్షల 72వేల ఓట్లతో ప్రస్తుత తిరుపతి ఎంపి మద్దిల గురుమూర్తి తన సమీప అభ్యర్థి టిడిపికి చెందిన పనబాక లక్ష్మీపై గెలుపొందారు. అప్పుడు జరిగిన ఘటనలపై కేంద్ర ఎన్నికల సంఘం ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇప్పుడు చర్యలకు ఉపక్రమించింది. అందుకు బాధ్యులను చేస్తూ అప్పట్లో ఆర్‌వోగా వ్యవహరించిన తిరుపతి కార్పొరేషన్ కమీషనర్ (ప్రస్తుతం అన్నమయ్య జిల్లా కలెక్టర్) గిరీషాను దోషిగా చూపిస్తూ సస్పెండ్ చేసింది. వాస్తవానికి నిక్కచ్చైన, మంచి అధికారిగా గిరీషాకు పేరుంది. కానీ అధికార పార్టీ నాయకులు స్వార్థానికి బలయ్యారు. తాజాగా కంప్యూటర్ ఆపరేటర్లు, డిప్యూటీ తహశీల్దారులు వంటి కిందస్థాయి ఉద్యోగులపై చర్యలకు ఉపక్రమించారు. కానీ ఇందుకు కారణమైన అధికార పార్టీ పెద్దలు దొరలుగా చెలామణి అవుతున్నారు. ఆ ఎన్నికల్లో గెలుపోటముల అభ్యర్థులను కనీసం వివరణ అడిగిన పాపన పోలేదు. అది కూడా దొంగలు పడ్డ ఆరు నెలలకు కుక్కలు మొరిగాయి అన్న చందానా ఎన్నికలు జరిగి మూడు సంవవత్సరాలు పూర్తవుతున్నప్పడు ఇలా వ్యవహరిస్తే ఎన్నికల కమీషన్ అంటే అక్రమార్కులకు ఎలా భయం ఉంటుందో ఆ అధికారులుకే తెలియాలి.

తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నిక అనేది మచ్చుక మాత్రమే. స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులను అడ్డుకుని, వారిపై దాడులు చేసి, నామినేషన్ పత్రాలను చించేచి, నామినేషన్ వేసేందుకు వచ్చేవారిని వ్యానులో వేసుకుని సుదూర ప్రాంతాలకు తరలించి నామినేషన్ సమయం అయిపోయేలా చేయడం, లేకపోతే పోలీసు స్టేషన్‌లో నిర్బంధించారు. ప్రతి పోలింగ్ బూత్ వద్ద అధికార దర్పం ప్రదర్శిస్తూ ఇష్టానుసారంగా వ్యవహరించిన తీరు జగమెరిగిన సత్యమే. పైపెచ్చు పారదర్శకంగా అంటూ ప్రకటనలు.

ఇక మరీ దారుణమైన విషయం. పట్టాభద్రులు, ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలు. వాస్తవానికి ఈ రెండు స్థానాలు కమ్యూనిస్టుల కంచుకోట. ఎలాగైనా ఈ సారి అధికార పార్టీ ఆ స్థానాలు కైవసం చేసుకోవాలని పథకం వేసి అనేక కుట్రలకు పాల్పడిందని ప్రతిపక్షాలు కోడై కూశాయి. దొంగ ఓట్లను సృష్టించారు. ఉపాధ్యాయులను, ఓటర్లను భయభ్రాంతులకు గురి చేశారు. ఆఖరికి ఐదో తరగతి కూడా చదవని మహిళ పట్టాభద్రుల ఎన్నికల్లో ఓటు వినియోగించుకుంది. సాక్షాత్తూ మీడియా సాక్షిగా తిరుపతిలో ఈ తంతగాన్ని వెలికితీశారు. అయినా చర్యలు లేవు. చదువుకోని వ్యక్తులు పట్టాభద్రుల ఎన్నికల్లో ఓటర్లుగా మారడం దారుణం. ఇలా ఒకటేమిటి ఎన్నిక ఏదైనా నకి'లీలలు'షరా మామూలే. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో సైతం వేలాది నకిలీ ఓట్లను అధికార పార్టీ నమోదు చేసిందని, ప్రతిపక్షాలు కోడై కూస్తున్నాయి.

జొన్నలు, మొక్క జొన్నలు పంపిణీకి సిద్ధం

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: రైతులకు సబ్సిడీపై ఇచ్చేందుకు జొన్నలు, మొక్క జొన్నల విత్తనాలు ఆర్బికేలలో సిద్ధంగా వున్నాయని మండల వ్యవసాయాధికారి ధనలక్ష్మి తెలిపారు. జొన్నలు 5 కేజీలు బ్యాగు రూ.130, మొక్కజొన్నలు 5కేజీల బ్యాగు రూ.100కు ఇస్తున్నా మన్నారు. కావలసిన వారు ఆధార్ కార్డు జిరాక్స్, పన్ బుక్ జిరాక్స్ కాపీలతో ఆర్బికేలలో తమ సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బస్సు యాత్రను విజయవంతం చేయాలి: వైసిపి

ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట నుంచి ఈ నెల 21న ఆదివారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో నిర్వహించే సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని తిరుపతి జిల్లా వైసిపి కార్యదర్శి, నాయుడుపేట రూరల్ జెడ్పిటిసి కన్వీనర్ ఓట్టూరు కిషోర్ యాదవ్, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పిలుపు నిచ్చారు. మండలంలోని ప్రజలు కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ఎంపీపీ, జడ్పిటిసి, ఎంపిటిసి, సర్పంచులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, అభిమానులు, సానుభూతి పరులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

కొత్త వాలంటీర్ల నియామకం

ప్రజాశక్తి - పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రామిరెడ్డి శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కొత్త వాలంటీర్ల నియామకం శనివారం నిర్వహించారు. పాలచ్చూరు గ్రామపంచాయతీ సంబంధించి ఒడిపల్లి నాగరత్నమ్మ, పెళ్లకూరు గ్రామానికి మాల్యాద్రి, తాళ్వాయిపాడులో మనుబోలు శివాజీని ఎంపిక చేసి ఎంపీడీవో సురేష్ బాబు చేతుల మీదుగా వారికి నియామక పత్రాలు అందించారు.

వీధి దీపాలకూ దిక్కు లేదా?: జనసేన

ప్రజాశక్తి-తొట్టంబేడు: పంచాయతీ పల్లెల్లో వీధి దీపాలు ఏర్పాటు చేసేందుకు జగన్ ప్రభుత్వానికి గతి లేకుండా పోయిందని దంటా జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత విమర్శించారు. 'ఇంటింటికి జనసేన' కార్యక్రమంలో భాగంగా ఆమె మండలంలోని జోనుపల్లిలో శనివారం పర్యటించారు. జోనుపల్లిలో నెలకొన్న అధ్వాన పరిస్థితులను చూసి నివ్వెర పోయారు. పేదన్న గ్రామంలో కనీసం వీధిలైట్లు, మురుగు కాలువలు, సిసి రోడ్లు సరిగా లేవంటూ ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ ప్రభుత్వం ఏర్పడిన ఈ ఐదేళ్లలో జోనుపల్లి గ్రామానికి కనీసం ఒక్క వీధి దీపాన్ని కూడా ఏర్పాటు చేయలేక పోయిందని ధ్వజమెత్తారు. జనసేన-టిడిపి ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పల్లెల్లో అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, శివకుమార్, రాఘవయ్య పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న జనసేన నాయకురాలు వినుత

'మోహిత్ రెడ్డిని ఎమ్మెల్యేగా ఆదరించండి'

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరి నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగేందుకు వచ్చే ఎన్నికల్లో చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించాలని చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి కోరారు. చంద్రగిరి పట్టణంలోని ఆక్కగార్ల కాలనీ, బీడీ వర్కర్స్ కాలనీ, సామాజిక కాలనీలలో శనివారం పర్యటించి గడప గడపలో సంక్షేమ పథకాల జాబితాలను అందించారు. కాలనీలోని దీర్ఘకాలిక సమస్యలను తన వెంట వచ్చిన సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ, పంచాయతీ అధికారులతో చర్చించి ఎక్కడికక్కడే పరిష్కారం చేయించేలా హర్షిత్ రెడ్డి చొరవ చూపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, జెడ్పిటిసి చిట్టకారు యుగంధర్ రెడ్డి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

దహన క్రియలకు ఆర్థికసాయం

ప్రజాశక్తి - తొట్టంబేడు: తొట్టంబేడు మండలం తాటిపర్తి పంచాయతీ, తాటిపర్తి గ్రామ ఎస్టీ కాలనీకి చెందిన మాజీ సర్పంచ్ వెంకటరత్నం రాజయ్య అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలియగానే ఎమ్మెల్యే అత్త, మండల వైసిపి సీనియర్ నాయకులు ఉన్నం వాసుదేవ నాయుడులు మృతుని భౌతికకాయాన్ని నివాళులర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి రాజయ్య దహన క్రియలకు వైసిపి సీనియర్ నాయకులు ఉన్నం వాసుదేవ నాయుడు తమ వంతు సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ కుటుంబానికి పార్టీ అండగా వుంటుందని ఓదార్పు భరోసా ఇచ్చారు.

నేడు ఉచిత మెగా కంటి చికిత్స శిబిరం

ప్రజాశక్తి-పాకాల: లయన్స్ క్లబ్ ఆఫ్ పాకాల ప్లాటినం వారి ఆధ్వర్యంలో శంకర్ నేత్రాలయ హాస్పిటల్ మిషన్ ఆఫ్ విజన్ ట్రస్ట్ చెన్నై ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నామని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లెనిన్ విజయబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాకాల టౌన్ లో చుట్టుపక్కల గ్రామ ప్రజలకు ఎవరికైనా ముందు చూపు కంట,దూరపు చూపు,కంటిలో పువ్వు,కంటి చూపు తగ్గిన వారికి ఈ శిబిరంలో ఉచిత చికిత్స అందిస్తామని పేర్కొన్నారు. ఎంపికైన రోగులకు శంకర్ నేత్రాలయం చెన్నై కంటి ఆసుపత్రిలో వైద్యంతో పాటు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. రెటీనా, గ్లోకోమా ఆక్యులో ప్లాస్టి చికిత్స ఉచితంగా అందిస్తామని తెలిపారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్థానిక పాకాల బాలికల జూనియర్ కళాశాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తామని, వివరాలకు 8309206246 నెంబరును సంప్రదించవచ్చని తెలిపారు.

టిడిపితోనే శ్రీకాళహస్తి అభివృద్ధి: రిషితారెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టిడిపి తోనే శ్రీకాళహస్తి అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని బొజ్జల రిషితా రెడ్డి అన్నారు. 'ఇంటింటికి మీ బొజ్జల' కార్యక్రమాన్ని పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో శనివారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వ లోపాలను రిషిత రెడ్డి ఎండగట్టారు. ముఖ్యంగా బియ్యపు పాలనలో నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడిందన్నారు. తిరిగి బొజ్జల కుటుంబాన్ని వచ్చే ఎన్నికల్లో గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో తన భర్త బొజ్జల సుధీర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్, క్లస్టర్ ఇన్‌ఛార్జి కండ్రిగ రమేష్, యూనిట్ ఇన్‌ఛార్జి ప్రతాప్, మాజీ కౌన్సిలర్ ప్రసాద్ నాయుడు, సత్రవాడ ప్రవీణ్, మునిక్రిష్ణ ఆచారి, పాల్గొన్నారు.

సిఎంకు దళిత నాయకుల సత్కారం

సిఎంను సత్కరిస్తున్న దళిత నాయకులు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సామాజిక న్యాయానికి గుర్తుగా విజయవాడలో దాదాపు రూ.400 కోట్లు వెచ్చించి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని జాతికి అంకితం చేసిన సందర్భంగా దళిత నాయకులు ఆయన్ను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ బిఫ్ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్, మెరుగు చందన్ నాగ్, యు చంద్రమౌళి, కె జగదీష్, ఎం మధు సాంఘిక శాఖ మంత్రి డాక్టర్ మెరుగు నాగార్జున ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం బహుకరించి, దుశ్శాలువతో సన్మానించారు. అనంతరం 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం, 80 అడుగుల పెడస్టల్ కలిగిన విగ్రహ నమూనా మోమెంటోను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి బహూకరించి, అంబేద్కర్ భారీ విగ్రహవిష్కరణకు కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

కబడ్డీ మండల విజేత 'నీరువాయి బాయ్స్'

ప్రజాశక్తి-పిచ్చాటూరు: పిచ్చాటూరు లో 'ఆడుదాం ఆంధ్ర'లో భాగంగా శనివారం నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ పోటీలలో నీరువాయి బాయ్స్ కబడ్డీ టీం ఫైనల్లో విజయం సాధించి విజేతగా నిలిచింది. వీరికి ట్రోఫీని పిచ్చాటూరు ఎంపీడీఓ శ్రీనివాసులు అందించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో దాగి ఉన్న క్రీడా రత్నాలను, మాణిక్యాలను వెలుగులోకి తీసే వారిని రాష్ట్ర, దేశ స్థాయిలో వెలుగులోకి తీసుకు వచ్చే ఉద్దేశ్యంతో ప్రభుత్వ కార్యక్రమం 'ఆడుదాం ఆంధ్ర' అని తెలిపారు. మండల స్థాయిలో శనివారం నిర్వహించిన ఈ కబడ్డీ పోటీలో పాల్గొన్న జట్టును నీరువాయి బాయ్స్ జట్టును విజేతగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంతట యుగంధర్ రాజు, మహిళా పోలీస్ లక్ష్మి, పిఈటి అమ్ములు, పంచాయతీ సెక్రెటరీ మహాలక్ష్మి, హెడ్ కానిస్టేబుల్ వెంకటమని ఇరు జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు.

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

నేర సమీక్ష సమావేశంలో డీఐజీ ఆదేశం

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డిఐజి అమ్మిరెడ్డి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని రాయలసీమ రేంజ్ డీఐజీ ఆర్ఎన్ అమ్మిరెడ్డి పిలుపు నిచ్చారు. స్థానిక శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సావేరి అతిథి గృహం సమావేశ మందిరంలో జిల్లా పోలీస్ అధికారులతో డీఐజీ నెలవారి నేర సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నడుస్తున్న ఈ మూడు నెలలు అత్యంత క్లిష్టమైన రోజులు అని, మనం అప్రమత్తంగా ఉండకపోతే అందరూ సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. సమస్యలు ఎక్కడ ఉత్పన్నం అవుతున్నాయో తెలుసుకొని సకాలంలో పరిష్కరించు కోవాలన్నారు. ఈ రోజు నుండే తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు ఉన్న గ్రామాలు, వార్డులను ప్రతిరోజూ సందర్శించి, స్థానికులతో సమావేశమై ముందస్తు సమాచారాన్ని సేకరించి ఎన్నికల నియమావళిని వివరించి అక్కడ నివసిస్తున్న ఎలక్షన్ ట్రబుల్ మాంగర్స్ కదలికలను అరికట్టాలన్నారు. ఎస్‌హెచ్ఓలు అందరూ తమ పరిధిలోని ప్రతి పోలింగ్ స్టేషన్ల భౌగోళిక స్థితిగతులను తెలుసుకొని శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రణాళికా బద్ధంగా పని చేయాలన్నారు. అమాయక ప్రజలను అనవసరంగా ఎన్నికల కేసులలో ఇరికించవద్దని, పాత ఎన్నికల ట్రబుల్ మాంగర్స్‌ను బైండోవర్ చేసి తరచుగా కౌన్సెలింగ్ నిర్వహిస్తూ ఉక్కు పాదం మోపి వారిని నిలువరించాలన్నారు. ఎస్‌పి పి.పరమేశ్వర రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల విధుల్లో ఏ అధికారి, పోలీసు సిబ్బంది పక్షపాతంతో వ్యవహరించకూడదన్నారు. పోలింగ్ స్టేషన్ లో అక్రమాలు జరిగినప్పుడులేదా జరుగు తున్నట్టు తెలిస్తే మౌనం వహించ కూడదని, ఎన్నికల నిబంధనలు, విధులను ఉల్లంఘించిన అధికారులు, సిబ్బందిపై భారత ఎన్నికల సంఘం తీవ్రమైన చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకటరావు, కులశేఖర్, విమల కుమారి, రాజేంద్ర, ట్రైనీ ఐపీఎస్ పాటిల్ దేవరాజ్ మనీష్, జిల్లాలోని డీఎస్పీలు, సిఐలు, ఎస్సైలు, ప్రశంసా పత్రాలు అందుకున్న సిబ్బంది పాల్గొన్నారు.

'సిరా రంగులు' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఐఎఎస్ అధికారి అభిషేక్ సింహ్ రాసిన హిందీ కవితలను తెలుగులోకి ఆకుల మల్లేశ్వరరావు అనువాదం చేసి రూపొందించిన 'సిరా రంగులు' పుస్తకావిష్కరణ తిరుపతి నగర పరిధిలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో తెలుగు భాషా ఉద్యమ సమితి అధ్యక్షురాలు గంగవరం శ్రీదేవి పుస్తకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ అనువాద సాహిత్యం విరివిగా రాయడం వల్ల తెలుగు సాహిత్యం మరింత సుసంపన్నం అవుతుందని అన్నారు. అనువాద ప్రక్రియ అనేది కత్తి మీద సాములాంటిదని, మూల రచనల్లోని అంశాలు, భావాలు, తెలుగుదనం ప్రతిబింబించే జాతీయమైన తెలుగు భాషలో చెప్పడం అనువాద రచన స్వతంత్ర రచన అనంత సృజనాత్మకంగా ఉండాలని గాలి గుణశేఖర్ తెలిపారు. నాదెండ్ల శ్రీమన్నారాయణ మాట్లాడుతూ స్యాహీకే రంగ్ హిందీ కవితలను ఆకుల మల్లేశ్వర రావు సరళ సుందరమైన తెలుగులో 'సిరా రంగ్' పేరిట పుస్తకం తీసుకురావడం అభినందనీయమన్నారు. అను వాద కర్త ఆకుల మల్లేశ్వరరావు మాట్లాడుతూ తను అనువాదంలోని విషయాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో టెంకాయల దామోదరం, తెలుగు భాషా ఉద్యమ సమితి వ్యవస్థాపకులు డాక్టర్ సాకం నాగరాజ, తమటం రామచంద్రారెడ్డి, పేరూరు బాలసుబ్రమణ్యం, కృష్ణవేణి, సుభద్ర, అరసం అధ్యక్ష కార్యదర్శులు యువశ్రీ మురళి, నెమిలేటి కిట్టన్న, సురేంద్ర రోడ్డా, గొడుగుచింత గోవిందయ్య, నడ్డి నారాయణ, మల్లారపు నాగార్జున, ఏను గు అంకమ నాయుడు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

సిరా రంగులు పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

ఆర్ఓవాటర్ ప్లాంటు ప్రారంభం

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్ : తిరుపతి జిల్లా వెంకటగిరి మండలంలోని చిన్నప్పరెడ్డి పల్లి పంచాయతీ నీల కంటాపురం గ్రామానికి సురక్షితమైన, స్వచ్ఛమైన తాగునీటిని అందించడానికి, శ్రీనివాసన్ సర్వీసెస్ ట్రస్ట్ ద్వారా రూ.6.26 లక్షలతో గ్రామంలో గంటకు 500 లీటర్ల బోర్‌వెల్‌తో కూడిన ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ నీరు నాణ్యత లోపించి తాగలేని పరిస్థితి వుంది. డాక్టరు పళని స్వామి సమక్షంలో, (రిటైర్డ్) - విద్యా సలహాదారు, వెంకటగిరి రాజా విబి సాయికృష్ణ యాచేంద్ర పాల్గొని వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి ప్రజలకు నీటి సరఫరాకు శ్రీకారం చుట్టారు. జిల్లా గిరిజన సంక్షేమ అధికారి సూర్య నారాయణ, యానాదుల కమ్యూనిటీ కోసం అందుబాటులో ఉన్న ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. గ్రామ ముఖ్య వ్యక్తుల సైట్ హెడ్ జైసింగ్ వెంకటగిరితో కలిసి యాక్సెస్, సౌకర్యాలను మెరుగుపరచడానికి శ్మశాన వాటిక స్థలాన్ని పరిశీలించారు. డా.భాస్కర్ రావు పరిశుభ్రమైన సురక్షితమైన నీటి ప్రాముఖ్యత, కలుషిత నీరు తాగడం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తిరుపతి ఉద్యానవనశాఖ సహాయ సంచాలకులు దశరథరామిరెడ్డి, ఎస్టీ రైతులకు అందుతున్న పథకాల గురించి వివరించి ఉపయోగించు కోవాలన్నారు. ఏపీ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల (బాలికలు), వెంకటగిరి - ప్రిన్సిపాల్ విజయ బాస్కర్ రెడ్డి శ్రీనివాసన్ సర్వీసెస్ ట్రస్ట్ గ్రామాభివృద్ధి అధికారులు, అలేఖ్య, కేశవులు, అప్పిని పార్ధ, హరికృష్ణ,

ఇక 'ఆన్‌లైన్'లో ఎంప్లాయిమెంట్ సేవలు : కలెక్టర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ఆంధ్రప్రదేశ్ లోని అన్ని జిల్లాల ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజిలు, మోడల్ కెరీర్ సెంటర్లు ఇంటర్నెట్ సెంటర్లు, మొబైల్ ద్వార కూడా పొంద వచ్చని, ప్రస్తుతం అందుతున్న సేవలన్నింటిని భారత ప్రభుత్వ నేషనల్ కెరీర్ సర్వీస్ (ఎన్సీఎస్) పోర్టల్ తో ఆన్లైన్ లోఅనుసంధానించామని కలెక్టర్ వెంకట రమణా రెడ్డి తెలిపారు. అందుకు సంబంధించిన పోస్టర్ ను శనివారం స్థానిక కలెక్టరేట్ కలెక్టర్, ఆవిష్కరించారు. ఈ ఆన్లైన్ సేవలు ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్, రెన్యువల్, అదనపు అర్హతలు నమోదు సులభ రీతిన హెచ్ టి టి పి ఎస్ ://ఎంప్లాయిమెంట్ డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ ద్వారా నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. అభ్యర్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకుంటే వారికి లాగిన్ వివరాలు, తాత్కాలిక రిజిస్ట్రేషన్ నెంబర్ వెంటనే ఎస్సెమ్మెస్ ద్వారా పంపుతారన్నారు. సంబంధిత జిల్లా అధికారి వారి అభ్యర్థనను ఆమోదించిన తర్వాత వారికి ఎస్సెమ్మెస్ ద్వారా రిజిస్ట్రేషన్ నెంబర్ తెలుపుతారన్నారు. అభ్యర్థులు ఎంప్లాయిమెంట్ కార్డ్ ను లాగిన్ ద్వారా డౌన్లోడ్ చేసుకోవచ్చునని తెలిపారు. సందేహాలకు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి ఫోన్ 9441460041 నెంబర్ కు సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ ఆఫీసర్ పెంచల కిషోర్ , సబ్ - ఎంప్లాయిమెంట్ అధికారి, తిరుపతి ఎస్ వెంకట రమణ పాల్గొన్నారు

'స్పందన' సమస్యలపై స్పందించండి: కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: కార్పొరేషన్‌కి వచ్చే స్పందన సమస్యలను, జగనన్న స్పందన కార్యక్రమానికి వచ్చే సమస్యలను పరిశీలించి ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేసి పని పూర్తి అయినట్లు 'స్పందన' కార్యక్రమానికి అప్ లోడ్ చేయాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అన్నారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం అన్ని విభాగాల అధిపతులతో ప్రత్యేక సమావేశం కమిషనర్ నిర్వహించారు. జగనన్న స్పందన సమస్యలను, డయల్ యువర్ కమిషనర్, స్పందనలో వచ్చే ప్రజా ఫిర్యాదులను ఆలస్యం కాకుండా పరిష్కరించాలన్నారు. 'ఆడుదాం ఆంధ్ర ' కార్యక్రమంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది క్రీడాకారులకు సహాయ సహకారాలు అందించాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ దశ వైద్య శిబిరాలకు చికిత్సలు అవసరమైన వారిని జనవరి 3 నుండి జూన్ 30వ తేదీ వరకు జరిగే మెడికల్ క్యాంపులకు పంపించేందుకు సచివాలయ కార్యదర్శులు, వాలంటీర్ల సహకారంతో కృషి చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఈ సమావేశంలో స్మార్ట్ సిటి జి.ఎం చంద్రమౌళి, రెవెన్యూ అధికారులు కెఎల్‌వర్మ, సేతుమాధవ్, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

కష్టపడే సమయం ఆసన్నమైంది: వెందోటి

ప్రజాశక్తి - బాలాయపల్లి : వైసిపి కార్యకర్తల నుంచి నాయకులు వరకు కష్టపడే సమయం ఆసన్న మయిందని వైసిపి మండల కన్వీ న ర్ వెందోటి కార్తీక్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి ఇప్పటి వరకు అమలు చేసి సంక్షేమ పథకాలను ప్రతి కార్యకర్త గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వివరించాలన్నారు.ఎన్నికల సమయం దగ్గర పడుతుంది ప్రతి కార్యకర్త ఒక సైనికుడు లాగా పని చేయాలని పిలుపునిచ్చారు. కష్టపడ్డ వారిని తాము గుర్తుపెట్టుకుంటామని తెలిపారు. ఇప్పటివరకు వైయస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీలకు అతీతంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించామన్నారు. మండలంలోని ప్రతి పల్లెకు రోడ్డు బస్సు సౌకర్యం ఏర్పాటు చేసిన ఘనత నేదురుమల్లి కుటుంబందే అని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి జనార్ధన్ రెడ్డి, వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే రాజ్యలక్ష్మి తనయుడు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ని వెంకటగిరి ఎమ్మెల్యేగా గెలిపించేందుకు ఎప్పటి నుంచి ఎన్నికలు పూర్తయ్యే వరకు అలుపెరగకుండా పనిచేయాలని కార్యకర్తలను నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు గుర్రం రామ్మూర్తి యాదవ్, బాలాయపల్లి సహకార సంఘం అధ్యక్షుడు పల్లంటి రాంబాబు నాయుడు వెందోటి హరికృష్ణ రెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కార్తీక్ రెడ్డి

నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం: కాంగ్రెస్

ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్: కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు దుగరాజ పట్టణం పోర్టు మంజూరు చేసిందని, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు పోర్టు నిర్మాణం విస్మరించి నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేశాయని మాజీ ఎంపీ చింతామోహన్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలో అశోక్ నగర్ లో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ హయాంలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో కాంగ్రెస్ దుగరాజపట్నం పోర్టు మంజూరు చేసిందని, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు పోర్టు నిర్మాణాన్ని మరిచిపోవడంతో వేలాది మంది నిరుద్యోగులకు నిరాశ మిగిలిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీస్తోందని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 130 స్థానాల్లో విజయం సాధిస్తుందన్నారు. ఈ ప్రచారంలో మాజీ ఎంపీ కుమార్తె నినా, ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు పంటా శ్రీనివాసులు రెడ్డి, నాయకులు పూల చంద్రశేఖర్, వేమయ్య, నాగభూషణం పాల్గొన్నారు.

తొట్టంబేడు ఎస్ఐ సేవలకు ప్రశంస

డిఐజి నుంచి ప్రశంసా పత్రం బహూకరణ

ప్రశంసా పత్రం అందుకుంటున్న ఎస్ఐ రాఘవేంద్ర

ప్రజాశక్తి- తొట్టంబేడు: తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర కు శనివారం తిరుపతిలోని పద్మావతి యూనివర్సిటీలో నిర్వహించిన పోలీసుల సమీక్ష సమావేశంలో అనంతపురం రేంజి డిఐజి ఏ ఎస్‌అమ్మిరెడ్డి ప్రశంసా పత్రం అందించి అభినందించారు . గత ఏడాది నవంబర్ 29న కురిసిన భారీ వర్షాలకు మండలంలోని కారాకొల్లు వద్ద గుండ్లమడుగు వాగు దాటేందుకు ప్రయత్నిస్తుండగా వరద ఉధృతి ఎక్కువగా కావడంతో వాగు దాటేందుకు ప్రయత్నిస్తున్న కారాకొల్లు గ్రామానికి చెందిన చిన్న బత్తయ్య నాయుడు(52) ఆయన సతీమణి నాగరత్నమ్మ (42)లు తిరువన్నామలై కు వెళ్లి వస్తుండగా వరద ప్రవాహంలో చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. అయితే వీరు పక్కనే ఉన్న ఓ విద్యుత్ స్తంభాన్ని పట్టుకొని సాయం కోసం కేకలు వేయడంతో గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారాన్ని అందించారు . దీంతో వెంటనే స్పందించిన ఆయన అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర అక్కడికి చేరుకుని వరద ప్రవాహంలో చిక్కుకొని విద్యుత్ స్తంభాన్ని పట్టుకొని సాయం కోసం ఎదురుచూస్తున్న భార్యాభర్తలను తొట్టంబేడు ఎస్ ఐ , సిబ్బంది వరద ఉధృతిని కూడా లెక్క చేయకుండా అక్కడికి చేరుకుని వారిని సురక్షితంగా బయటికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు పోలీసులను అభినందించారు. ఈ నేపథ్యంలో శనివారం పద్మావతి యూనివర్సిటీలో జరిగిన పోలీసుల సమీక్ష సమావేశంలో తమ సాహసాన్ని ప్రదర్శించి ఇద్దరి ప్రాణాలను కాపాడిన ఎస్ఐ రాఘవేంద్రను అనంతపురం రేంజి డిఐజి అమ్మిరెడ్డి అభినందించడంతో పాటు ప్రశంసా పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా పలువురు ఎస్ఐను అభినందించారు.

అవయవ దానంపై అవగాహన కల్పిస్తున్న వక్తలు

అవయవ దానంపై చైతన్యం అవసరం

అవగాహన సదస్సులో వక్తల పిలుపు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: అవయవ దానం పై ప్రతి ఒక్కరిలో చైతన్యం అవసరం అని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. స్థానిక తుడా రోడ్డు లోని సంకల్ప సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అవయవ దానంపై అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ వి కుమార్ మాట్లాడుతూ రెండు రోజుల క్రితం స్విమ్స్ ఆసుపత్రిలో బ్రెయిన్ డెడ్ కు గురైన హేమ కుమార్ యువకుడి అవయవాలు దానం చేయడం ద్వారా నలుగురు ప్రాణాలను కాపాడగలిగామన్నారు. చెన్నై బెంగళూరు హైదరాబాద్ వంటి మహానగరాలకే పరిమితమైన అవయవ దానం మార్పిడి శస్త్ర చికిత్సలను నేడు తిరుపతి లోని స్విమ్స్ ఆసుపత్రుల్లోనే విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. గతంలో కోటీశ్వరులకు మాత్రమే అవకాశమున్న అవయవ మార్పిడిని, రాష్ట్ర ప్రభుత్వం చొరవతో ఆరోగ్యశ్రీ ద్వారా సామాన్యులకు సైతం ఉచితంగా అందించగలుగుతున్నామన్నారు. అవయవదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మోహన్ ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ భాను మాట్లాడుతూ అవయవ దానంపై ప్రతి ఒక్కరూ ఆహ్వాన కల్పించేందుకు తమ సంస్థ నిరంతరం కృషి చేస్తుందన్నారు. అవయవ దానం పై అపోహలు వీడి అవయవ దాతతో పాటు కుటుంబ సభ్యులూ అవగాహన పెంచుకోవాలన్నారు. శ్వేతా మాజీ సంచాలకులు భూమన్ మాట్లాడుతూ కుల మతాలు అవయవదానానికి అడ్డంకి కాదన్నారు. అవయవదానం ద్వారా తాము మరణించిన నలుగురిని బతికించేందుకు సహాయపడుతామని గుర్తు చేశారు. సాంకేతి కంగా అభివృద్ధి చెందుతున్న నేటి సమాజంలో కూడా అపోహలకు చోటివ్వడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సంకల్ప ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ బండ్ల నాగేశ్వర్, మేనేజింగ్ డైరెక్టర్ నాగరాజు కుమార్, డాక్టర్ దగ్గు మాటి శ్రీహరిరావు, డాక్టర్ ఆనంత్, సంకల్ప ఆస్పత్రి డైరెక్టర్ ప్రేమ్, వైద్యులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే దళితులకు సామాజిక న్యాయం: నెలవల

ప్రజాశక్తి-నాయుడుపేట: చంద్రబాబుతోనే రాష్ట్రంలో దళితులకు సామాజిక న్యాయం జరుగుతుందని మాజీ ఎంపీ, సూళ్లూరుపేట నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. నాయుడుపేట పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెంకటగిరిలో చంద్రబాబు నిర్వహించిన 'రా కదిలిరా..' కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నియోజకవర్గ నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి దళితులపట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. వైసీపీలోని దళిత ఎమ్మెల్యే, ఎంపీలను అవమానించారన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ ఛైర్మన్ శిరసనం భేటీ విజయభాస్కర్ రెడ్డి, మాజీ జడ్పిటిసి పేరంశెట్టి శ్రీరాం ప్రసాద్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పసల గంగా ప్రసాద్, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షులు అవదానం సుధీర్, జిల్లా తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు చెందేటి సుజాత, టిడిపి నాయకులు గూడూరు సుధీర్ రెడ్డి, విజయ్ కుమార్ నాయుడు, సంచి కృష్ణయ్య, కాపులూరు చక్రపాణి, బల్లి ముత్యాలయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

టిడిపి నాయకుడి మృతికి నివాళి

ప్రజాశక్తి -తొట్టంబేడు: మండలంలోని కొనతనేరి పంచాయతీ గుర్రప్ప నాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు సుబ్బనాయుడు శనివారం మృతి చెందారు. ఆయన భౌతికాయానికి మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బొజ్జల బృందమ్మ నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

చెడు అలవాట్లు లేకుంటేనే చక్కని ఆరోగ్యం

- డాక్టర్ చైతన్య సూచన

ప్రజాశక్తి -దొరవారిసత్రం: మద్యం సేవించడం, పొగ తాగడం, పొగాకు ఉత్పత్తులు వాడడం వంటి అలవాట్లను మానుకుంటేనే ఆరోగ్యం మెరుగవుతుందని వైద్యాధికారి చైతన్య రోగులకు సూచించారు. శనివారం దొరవారిసత్రం పిహెచ్‌సి పరిధిలోని వేణుంబాకం గ్రామంలో నిర్వహించిన విలేజ్ డాక్టర్స్ క్లినిక్‌లో పలువురి రోగులను పరీక్షించి అవసరమైన మందులు అందించారు. ప్రధానంగా రోగాలకు కారణమవుతున్న చెడు వ్యసనాలను మాని, మంచి ఆహారం సేవించి ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. బీపీ, షుగరు వ్యాధి గ్రస్తులకు రోగ స్థాయిని బట్టి మందులు అందించారు. ప్రతి నెలలో గ్రామాలకు వస్తున్న104 వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంటి వెలుగులో పరీక్షలు చేయించుకున్న కంటి చూపు లోపం ఉన్న పలువురికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ హెచ్ పి పావని, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, డీఈవో శివ, ఆశా కార్యకర్తలు సుజాత, సుగుణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టరు చైతన్య

వారసత్వ పార్టీలను తరిమికొట్టండి: ఆమ్ ఆద్మీ

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి): దేశంలో వారసత్వ రాజకీయాలతో అవినీతి పాలన సాగిస్తున్న వారసత్వ పార్టీలను తరిమికొట్టి క్రమశిక్షణ కలిగిన ఆమ్ ఆద్మీని ఆదరించి దేశ భవిష్యత్తుకు పునాది వేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ ఏపీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల ఇన్‌ఛార్జి ఆర్ మణినాయుడు పిలుపు నిచ్చారు. ఆమ్ ఆద్మీ చిత్తూరు పార్లమెంటు జిల్లా అధ్యక్షులు, చంద్రగిరి నియోజకవర్గ కన్వీనర్ ఐరాల లోకేష్ ఆధ్వర్యంలో ఆ పార్టీ చంద్రగిరి నియోజకవర్గం కార్యకర్తల సమావేశం వైయస్ఎంఆర్ కళ్యాణ మండపంలో శనివారం వాడి వేడిగా జరిగింది. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సి రమేష్ కుమార్ మాట్లాడుతూ సామ్యానుడికి రాజ్యాధికారం అందని ద్రాక్ష లాగా ఉండే పరిస్థితుల్లో సామాన్యులకు అవకాశం కల్పిస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు అరవింద్ కేజ్రీవాల్ గొప్ప నాయకుడన్నారు. నేటి సమాజంలో కొన్ని రాజకీయ పార్టీలు కొన్ని కుటుంబాలు, కొన్ని ప్రాంతాల కోసమే పాలన సాగిస్తున్నాయని, కేజ్రీవాల్ అందరికీ అవకాశం ఇస్తూ అన్ని ప్రాంతాల సమానా భివృద్ధికి కృషి చేస్తారన్నారు. అవినీతిని అరికట్టటానికి ఆమ్ ఆద్మీ పార్టీలోకి అడిగిపెట్టిన కార్యకర్తలందరూ సైనికుల కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు . ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఆమ్ ఆద్మీ పార్టీ వైపు ఆకర్షితులవుతున్నట్టు తెలిపారు. చీపురు గుర్తుతోనే అవినీతి పార్టీల నాయ కులను తరిమికొట్టాలని కోరారు. మొదట జెండాలు చేతబట్టి బ్యాండ్ సెట్, భజ భజంత్రీలతో వాయిద్యాలతో స్థానిక టవర్ క్లాక్ నుండి వైయస్ఎంఆర్ కళ్యాణ మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. మొదట ఆప్ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల ఇన్‌ఛార్జి మణినాయుడును దుశ్శాలువాతో సన్మానించారు. అనంతరం ప్రత్యేక ఆహ్వానితులందరినీ సన్మానించారు. తమ పార్టీకి ఐరాల లోకేష్ లాంటి యువ నాయకుడు దొరకటం అదృష్టమని రానున్న ఎన్నికలలో ఆమ్ ఆద్మీ పార్టీని ఆదరించి ఐరాల లోకేష్ ను గెలిపిం చాలని మణినాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా అధ్యక్షులు నగేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటా చలపతి, ఆర్ కె పట్టెం, రాష్ట్ర కార్యదర్శి కల్లూరు బాల సుబ్రమణ్యం, నాయకులు తిరుమలరెడ్డి, నందిని, గుణశేఖర్ రెడ్డి, చిట్టిబాబు, శ్రీరాములు, చందు, అక్బర్ హుస్సేన్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆమ్‌ఆద్మీ నాయకులు

అప్పీలు నోటీసు
గూడూరు 7th ADJ కోర్టులో
A.S. 8/2022
పామూరు మధుసూదన .... అప్పీలెంట్
V/s
దొమ్మరాజు సుబ్బరామిరాజు .....రెస్పాండెంట్
వగైరాలు
1.దొమ్మరాజు సుబ్బరామరాజు
2.దొమ్మరాజు ధర్మరాజు
5. కొండూరు సుబ్రమణ్యంరాజు
7. దొమ్మరాజు ఓబులరాజు
8. దొమ్మరాజు ఈశ్వరరాజు
10. దొమ్మరాజు వెంకట సుబ్బరాజు
12. కీర్తిపాటి రమణరాజు, పెదపరియరాచపాళెం, ఓజిలి మండలం, తిరుపతి జిల్లా.
సదరు నెంబరులో అప్పీలెంట్ మీమీద క్రింది కోర్టు డిక్రిని రద్దు చేయమని అప్పీలు వేసినందున మీకు ఆక్షేపణలున్న యెడల తే.01.02.2024 ఉదయం 10 గం॥పై కోర్టులో హాజరై తెలుపుకోవలసినది. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.
చదలవాడ దయాకర్,బి.ఎ., బి.ఎల్.,
అప్పీలెంట్ అడ్వకేట్, గూడూరు

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE :: GUDUR
I.P. No. 34 / 2023
S.K. Babu, S/o Shaik Ahmed Basha, Yeruru (vill), Chillakuru(M), Tirupati Dist. ..... Petitioner
Vs
1. S.K. Karimulla, S/o Khasim Saheb, Madamaru (Vill), Manubolu (M), SPSR Nellore District.
2. S.K. Tippu Alisher, S/o Imran Saheb, R/o Barigisaheb peta, Gudur town, Tirupati (dt)
3. K. Mahesh, S/o Rama Sundar Rao, R/o Mayabazar, Gudur town, Tirupati (dt)
4. P. Suresh, S/o Govindaiah, R/o Yeruru (Vill), Chillakuru (M), Tirupati (dt).
5. Kaku Murali Krishna reddy, S/o Chendra Sekhar Reddy, R/o Opposite RTC Colony, Naidupeta town and Mandal, Tirupati (dt).
6. Gadamsetty Varun Teja, S/o Late Gadamsetty Venkateswarlu, R/o Rajaveedi, Gudur town and Mandal, Tirupati (dt).
7. Pasupuleti Nageswar Rao, S/o Sri Hari Rao, Near Gudur II town Police station, Malavya Nagar, Gudur town and Mandal, Tirupati (dt).
8. K. Padmanabha Reddy, @ K.Reddy, S/o K. Ramachandr Reddy, Near MRO Office, Manubolu (Vill) & Mandal, SPSR Nellore (dt).
9. Harinaidu, S/o Not Known, R/o Chinna Kummeri Veedhi, Gudur town and Mandal, Tirupati (dt)
10. N. Chennaiah, S/o UnKnown, Pellevaldibba, Chillakur (M), Tirupati (dt).
11. Subbaiah, S/o Unknown, Chintavaram Village, Chillakur (M), Tiruapati (Dt)
......Respondents
జనరల్ నోటీసు
పై పిటిషనరు తనని ఇన్‌సాల్వెంట్‌గా డిక్లర్ చేయమని కోరుతూ పైన తెలిపిన కోర్టులో ఐ.పి.నెం.34/2023 దాఖలు చేసియున్నందున సదరు ఐ.డి.పై ఎవరికైనను ఆక్షేపణలు ఉన్నయెడల తేది.24-01-2024 న ఉదయం 10.30 నిమిషాలకు స్వయంగా కానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవల్సినదిగా ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.
పిటిషనరు తరుపు న్యాయవాది
ఇ. సుమన్,
న్యాయవాది, గూడూరు.